

హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కాలనీల సమస్యలు పరిష్కరించాలి: సుధీర్‌రెడ్డి

చంపాపేట, మే 6(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం, చంపాపేట, మన్సూరాబాద్ డివిజన్లలో తాగునీటి, డ్రైన్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని రోషన్‌దౌలా కాలనీలో ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇవ్వాలని, శ్రీరమణ కాలని, బీమానగర్, దేవినగర్ కాలనీ, మన్సూరాబాద్ డివిజన్‌లోని కొలన్ శివారెడ్డికాలనీలో డ్రైన్స్ నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. చంపాపేట డివిజన్ కిషన్‌కుమార్ ఎన్‌క్లేవ్‌లో యూజీడీ నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఎండీని కోరారు. ఎమ్మెల్యే వెంట ఆయా కాలనీల ప్రతినిధులు రవి, ప్రకాశ్, నరేందర్‌రెడ్డి, చంద్రయ్య, మహేందర్, డేవిడ్, పాండునాయక్, తిరుపతయ్య, అబ్రహాం, ఈశ్వరయ్య, రాధాకృష్ణ, కృష్ణ ఉన్నారు.



సైదాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు, బీజేపీ నేతలు

పాకిస్థాన్ వలసదారులను తరిమివేయాలి

● **బీజేపీ నేతలు**

సైదాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో నిబంధనలకు విరుద్ధంగా నివాసం ఉంటున్న పాకిస్థాన్, బంగ్లా రోహింగ్యాలు వెంటనే దేశాన్ని విడిచి వెళ్లాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాకిస్థాన్ వలసదారులను గుర్తించి వారిని దేశం నుంచి తరిమివేయాలని కోరుతూ బీజేపీ నేతలు మంగళవారం సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. పౌరసత్వం లేకున్నా నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి దేశ పౌరులుగా స్థిరపడ్డ పాకిస్థానీయులను గుర్తించి వారిని దేశం న ఉంచి బహిష్కరించాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అరుణారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవీందర్‌రెడ్డి, లింగాల హరిగౌడ్, నేతలు మధుకర్‌రెడ్డి, రమణ్ సింగ్, నవీన్‌పటాలే తదితరులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఘనంగా కుంకుమార్చన

చంపాపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడలోని సువర్ణభారతి గోశాలలో ఆది శంకరాచార్య జయంతి మహోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య నేతృత్వంలో మంగళవారం రుద్రహోమం, చండీహోమంను నిర్వహించారు. కుంకుమార్చనను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ సంస్థాగత ఎన్నికల కో-రిటర్నింగ్ అధికారిణి గీతామూర్తి, ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ నరసింహారెడ్డి

వినాయకనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

హయత్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని వినాయకనగర్ కాలనీ, హనుమాన్ మార్గ్‌లతో పాటు పలు కాలనీలలో విద్యుత్ అధికారులు మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ప్రక్రియను కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి పరిశీలించారు. అధిక సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయించినందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'మాక్ డ్రిల్'లో స్వచ్ఛందంగా పాల్గొనాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): నేడు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌లో యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఏబీవీపీ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వి తేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రిల్‌లో వైమానిక దాడి హెచ్చరిక, సైరన్‌ల పరీక్ష, క్రాష్ బ్లాక్‌అవుట్ వ్యాయామాలు, పౌరులను సురక్షితంగా తరలించడానికి రిహార్సల్స్, అత్యవసర సమయాల్లో సాధారణ ప్రజలకు భద్రతా చర్యలలో శిక్షణ ఇస్తారని వివరించారు.

నేడు వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం

రామంతాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ శ్రీనివాసపురంలో ప్రసిద్ధి చెందిన వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి 332వ ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరోజు రామస్వామిచారి, ప్రధాన కార్యదర్శి యాలాల వెంకటేశంచారి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

టీపీవో కుర్చీ ఖాళీ

● మొన్నటిదాకా డిప్యుటేషన్‌పై ఓ టీపీఎస్ విధులు

● గత నెల 30న ఆయన బదిలీ

● బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పడకేసిన పాలన



బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయం

సరూర్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని అతి పెద్ద కార్పొరేషన్లలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఒకటి. మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న ఈ కార్పొరేషన్‌లో టీపీవో కుర్చీ ఖాళీగా ఉంది. తాండూరు టీపీఎస్ లాలప్ప 2023 జూలైలో బడంగ్‌పేట్ బాధ్యతలు చేపట్టి గత నెల 30 వరకు విధులు నిర్వర్తించి విషయం తెలిసిందే. తాజాగా గత నెల 30న లాలప్పను జీహెచ్‌ఎంసీకి బదిలీ చేస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో వారం రోజులుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. నేటికీ కొత్త అధికారిని నియమించకపోవడంతో టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో పాలన పడకేసింది. ఆ సెక్షన్‌లో వివిధ రకాల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనపై ఈ ఎఫెక్టు పడింది.

పడకేసిన పాలన..

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో టీపీవో కుర్చీ ఖాళీగా ఉండడంతో పాలన పడకేసింది.

టీపీవోను నియమించాలి

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు ఒక పూర్తి స్థాయి టీపీవోతో పాటు ఇద్దరు టీపీఎస్‌లను కూడా నియమించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో ఇక్కడ విధుల్లో ఉంటేనే అక్రమాలకు కొంతలో కొంతైనా అడ్డుకట్ట పడుతుందని వారు పేర్కొంటున్నారు. మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే టౌన్ ప్లానింగ్ విభాగంలోని పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

దాదాపు 75 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో సుమారు 1.60లక్షల జనాభాను కలిగి ఉన్న బడంగ్‌పేట్‌లో కొత్త కాలనీలు ఎన్నో పుట్టుకొస్తున్నాయి. సదరు కాలనీల్లో జరుగుతున్న అక్రమనిర్మాణాలకు, బహుళ అంతస్తుల భవనాలకు అంతే లేదు. కొంతకాలంగా ఈ పోస్టులో డిప్యుటేషన్‌పై వచ్చిన వారే విధులు నిర్వర్తించేవారు. వారంలో మూడు రోజులు ఇక్కడ.. మూడు రోజులు వారికి రెగ్యులర్ విధులు నిర్వర్తించేవారు. ఆ మూడు రోజుల్లోనూ ఏమైనా సెలవులు వచ్చినా.. సమావేశాలు ఉన్నా అంతే సంగతులు. దీంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఈ సెక్షన్‌పై ఏ అధికారికి పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో అనేక అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. రెగ్యులర్ అధికారులు ఉంటేనే అక్రమాలకు అడ్డుకట్ట పడని ఈ రోజుల్లో.. ఇక సెక్షన్‌లో ముఖ్యమైన అధికారి లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. 32 డివిజన్లతో విస్తరించి ఉన్న బడంగ్‌పేట్‌లో కచ్చితంగా ఓ టీపీవోతో పాటు ఇద్దరు టీపీఎస్‌లు, ఇతర సిబ్బంది అవసరం. కానీ బడంగ్‌పేట్‌లో అసలు టీపీవో పోస్టే భర్తీ చేయకపోవడం గమనార్హం!

నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 6 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో నూతన టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి సూచించారు. గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. వేడుకలకు హాజరైన ఆయన తొలుత పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. టెక్నాలజీలో భారత్ దూసుకుపోతోందన్నారు. నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ కొత్త ఆవిష్కరణలకు నడుం బిగించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. నాలుగేళ్ల క్రమశిక్షణ, పట్టుదలతో చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు, నవతేజా టెక్నాలజీస్ డైరెక్టర్ సంగంకర్, కళాశాల డైరెక్టర్ డా. జయప్రద, ప్రిన్సిపాల్స్ శేషతల్పసాయి, రాంచంద్రారెడ్డి, బాలాజీ, ఉమామహేశ్వరరావు, అజ్మల్‌హుస్సేన్, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

● **అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ**

సైదాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని, గో హత్యలు ఆపాలని, గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ కోరారు. ఆదివారం నాడు యాదగిరిగుట్ట గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి గోవు ప్రతిమను బహుకరించి ఆహ్వానపత్రిక అందజేశారు. గతేడాది సెప్టెంబర్ 27న కశ్మీర్ నుంచి 14 రాష్ట్రాల మీదుగా 182 రోజుల పాటు కన్యాకుమారి వరకు 5,150 కిలోమీటర్లు కొనసాగిన గో రక్ష పాదయాత్ర వివరాలను ఆయన మంత్రికి వివరించారు. యాదాద్రి గిరి ప్రదక్షణకు మంత్రి హాజరుతావుతానని హామీ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు జిగ్నేష్ జోషి, సంజయ్‌గుప్తా, మల్లేశ్‌గౌడ్, కాస శ్రీనివాస్, రాఘవేంద్ర, సురేశ్‌గౌడ్, ఆర్య సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సురేఖకు గోమాత ప్రతిమను అందజేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ

మచ్చలేని నాయకురాలు సబితమ్మ

● **బీఆర్ఎస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రాంరెడ్డి**

సరూర్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి మచ్చలేని నాయకురాలని, అందుకే ఓబుళాపురం మైనింగ్ కేసులో కడిగిన ఆణిముత్యంలా నిర్దోషిగా నిలిచారని బీఆర్ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. మైనింగ్ కేసులో సబితారెడ్డిని కోర్టు నిర్దోషిగా ప్రకటించిన నేపథ్యంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయం కూడలిలో మంగళవారం పార్టీ నాయకులు బాణసంచా కాల్చి స్థానికులకు మిఠాయిలు పంచారు. అనంతరం రాంరెడ్డి మాట్లాడుతూ దాదాపు 12 సంవత్సరాలుగా ఈ కేసు కోర్టులో ఉన్నప్పటికీ ఎక్కడా సబితారెడ్డి మీద వచ్చిన ఆరోపణలు నిరూపితం కాలేదన్నారు. ఎలాంటి ఆధారాల్లేకుండా సబితారెడ్డిపై ఆరోపణలు చేసిన నాయకులు ఇప్పుడేం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. మాజీ కార్పొరేటర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేయాలి

● కేంద్ర మంత్రికి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ వినతి

రామంతాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్గరీని కోరినట్లు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ తెలిపారు. రామంతాపూర్‌లోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ రూ.600 కోట్ల రూపాయలు నిధుల విడుదల చేయగా కేంద్ర రవాణా శాఖ మంత్రి స్వయంగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు ఏళ్లు గడుస్తున్న పైపు లైన్లు, కరెంటు స్తంభాలు, కరెంటు కేబుల్స్, భూ సేకరణల విషయంలో గత ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పనులు నత్త నడకన కొనసాగడం జరిగిందని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లను కమిషన్ల కోసం ఏ విధంగా వేధింపులకు గురి చేస్తున్నారనే విషయాన్ని నితిన్ గడ్కరీకి వివరించినట్లు ఆయన తెలిపారు.

నక్సల్స్ దిష్టిబొమ్మ దహనం



నక్సల్స్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌కు మద్దతుగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నక్సల్స్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌కు ఏబీవీపీ మద్దతుగా నిలుస్తోందన్నారు. నక్సలైట్లతో ఎందుకు చర్చలు జరపాలో చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ సిటీ సెక్రటరీ పృథ్వి తేజ, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్ తదితరులు పాల్గొన్నారు.



రాచకాలువకు సర్వే చేస్తున్న ఇరిగేషన్, జలమండలి అధికారులు

రాచకాలువకు సర్వే.. హద్దుల కేటాయింపు

వనస్థలిపురం, మే 6(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీలోని రాచకాలువను ఇరిగేషన్, జలమండలి అధికారులు మంగళవారం పూర్తిస్థాయిలో సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేశారు. రాచకాలువను సర్వే చేసి హద్దులు నిర్ణయించడం శుభపరిణామమని, దీంతో తమకు వరదనీటి సమస్యలు తీరినట్లేననీ బృందావన్ కాలనీ, సౌభాగ్యనగర్ కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు శశికాంత్, నందకిషోర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఐ సతీశ్, డీఈ శుక్లజ, జలమండలి డీజీఎం రాజ్‌గోపాల్, సిరివెన్నల, కాలనీవాసులు చిత్తరంజన్, జగన్‌మోహన్‌చారి, వేణు, ప్రభాకర్, సహదేవ్ త్రిపాఠి, భాషా, వెంకట్, నారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.



మామిడి కాయలను రసాయనాలు లేకుండా మగ్గపెట్టే విధానంపై అవగాహన కల్పిస్తున్న గ్రేడ్‌వన్ సెక్రెటరీ నర్సింహారెడ్డి

పండ్ల పక్వానికి రసాయనాల వాడకం నిషేధం

● **గ్రేడ్‌వన్ సెక్రెటరీ నర్సింహారెడ్డి**

ఓల్డ్‌మలక్‌పేట మే 6 (ఆంధ్రజ్యోతి): మామిడి పండ్ల పక్వానికి రసాయనాల ను వాడకూడదని గ్రేడ్‌వన్ సెక్రెటరీ నర్సింహారెడ్డి అన్నారు. సహజ పద్ధతుల్లో మామిడి పండ్లను మాగబెట్టే విదానంపై మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పండ్ల వ్యాపారులకు, ట్రేడర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. రసాయనాలు వాడిన పండ్లను తినడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను నర్సింహారెడ్డి వ్యాపారులకు వివరించారు. సహజ పద్ధతుల్లో మాగబెట్టిన పండ్లను మాత్రమే అమ్మాలని సూచించారు. ఎవరైనా రసాయనాలు వాడినట్లు అనుమానం వస్తే సంబంధిత వ్యాపారులపై చట్ట పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు ఈ కార్యక్రనమంలో మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్, మామిడి పండ్ల ట్రేడర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 6(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన సోమవారం రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు జంక్షన్ వద్ద సోమవారం రాత్రి 11 గంటలకు రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తి(35)ని ఓ వాహనం ఢీకొట్టింది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు నీలిరంగు జీన్స్ ప్యాంటు, నల్లాచొక్కా ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.



ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన దుండగుడు(సీసీ టీవీ ఫుటేజీ)

ఇంట్లో చోరీకి యత్నం

● అలికిడికి నిద్ర లేచిన యజమాని

● యజమానికి మస్కా కొట్టి తప్పించుకున్న దుండగుడు

సరూర్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీకి యత్నించిన ఓ వ్యక్తి.. అలికిడికి నిద్ర లేచిన యజమానికి మస్కా కొట్టి తప్పించుకున్నాడు. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాలాపూర్ చౌరస్తాలోని త్రివేణినగర్ కాలనీలో నివసించే శర్మ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి దాటాక ఓ దుండుగుడు చోరీకి యత్నించాడు. ఇంటి కిటికీ అద్దాలు పగులగొట్టి, కిటికీ తలుపులను గట్టిగా తోయడంతో లోపల ఉన్న వాటర్ ఫిల్టర్ కింద పడి శబ్దం వచ్చింది. ఆ అలికిడికి యజమాని శర్మ నిద్రలేచి సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ దుండగుడు కిటీకీ పక్క నుంచి వెళ్తున్నట్టు కనిపించింది. ఆయన తలుపు తెరిచేలోగా దుండగుడు వేగంగా బయటకు వెళ్లి, తిరిగి అంతే వేగంగా యజమాని వద్దకు వచ్చి.. బయట నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని నమ్మించాడు. దాంతో ఆయన.. 'పదా చూద్దాం' అంటూ బయటకు వచ్చాడు. యజమానితో పాటు బయటకు వచ్చిన దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే శర్మ డయల్ 100కు కాల్ చేయగా పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

సబ్ రిజిస్ట్రార్‌పై దాడికి ఖండన

ఓల్డ్‌మలక్‌పేట, మే 6 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట సబ్‌రిజిస్ట్రార్ రవీందర్‌పై ఓవ్యక్తి దాడి చేశాడు. దీన్ని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం ఖండించింది. మంగళవారం ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసినందకు హయత్‌నగర్ పోలీసులకు నర్సింహారెడ్డి అభినందనలు తెలిపారు.

నత్తనడకన మూసీ పరీవాహక నాలా పూడికతీత పనులు

● రోడ్డుపై పేరుకుపోయిన మట్టి దిబ్బలు

● వాహనాల రాకపోకలకు అంతరాయం

రామంతాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజా ప్రతినిధుల పట్టింపులేని ధోరణి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి వాహనదారుల పాలిట శాపంగా మారింది. రాబోవు వర్షాకాలం నేపథ్యంలో రామంతాపూర్‌లో మాన్సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మూసీ పరీవాహక నాలా పూడికతీత పనులను చేపట్టారు. లక్షలు వెచ్చించి చేపట్టిన పూడికతీత పను లు నత్త నడకన కొనసాగుతుండడంతో ప్రజలు అసంతృప్తిని వెలిబుచ్చుతున్నారు. ముఖ్యంగా నాలా నుంచి తొలగించిన మట్టి, చెత్త చెదారం, వ్యర్థాలను పక్కన ఉన్న బైపాస్ రోడ్డుపై పోయడంతో అది కాస్తా దిబ్బలుగా పేరుకుపోయి రోడ్డు ఇరుకుగా మారింది. తక్షణమే అధికారులు స్పందించి చెత్తచెదారాన్ని, మట్టి దిబ్బలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై పేరుకుపోయిన మట్టి దిబ్బలు

గవర్నర్‌ను కలిసిన ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్

అల్వాల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సమీర్ శర్మ మంగళవారం రాజ్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. ఎన్‌సీసీ కెడెట్స్‌కు అందిస్తున్న శిక్షణతో పాటు భవిష్యత్‌లో దేశానికి నాయకత్వం వహించే విధంగా బాధ్యతాయుతంగా, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దుతున్న విషయాల ను ఆయన గవర్నర్‌కు వివరించారు. దేశ నిర్మాణంలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ నిర్వహిస్తున్న పాత్రను సైతం ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ఎన్‌సీసీ విస్తరణ విషయాలపై కూడా ఇరువురు మాట్లాడుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎన్‌సీసీకి ఆర్థిక పరమైన సహాయం అందే విధంగా చూడాలని సమీర్ శర్మ గవర్నర్‌ను అభ్యర్థించారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సమీర్ శర్మ